# అద్దానికి అవతలి వైపు

"గురువుగారూ! నేను రోజూ ఒంటి కాలిమీద నుంచుని కొలనులో జపంచేసుకుం టున్నప్పుడు నాకొక అనుమానం వస్తుంటుంది. రోజూ అడుగుదామనుకుంటూ మరచి పోతున్నాను" అన్నది తెల్లటి కొంగ తన రెండు కాళ్ళ మీదనిటారుగా నుంచుని.

"నువ్వు ఆ కొలనులో నుంచునేది జపం చేసుకోటానికా? అన్నీ అబద్ధాలు. వట్టి కొంగ జపం! చేపలు తినటానికి అలా ఒంటి కాలి మీద నుంచుంటావు"అన్నాడు చిన్న ముని కొంగ మాటలకు అడ్డం వస్తూ.

"హుష్! అలా అనకూడదు. జపం చేసుకుంటూనే చేపలు కనపడితే చటుక్కున పట్టేసుకుంటుంది. దాన్లో తప్పేముంది" అన్నది నల్లకోతి తెల్లటి పళ్ళికిలించి.

"అలా చెప్పు. జపం జపమే. చేపలు చేపలే" అన్నది కొంగ తన కత్తెర నోటితో చిత్రంగా నవ్వుతూ.

శుకమహర్షి అన్నాడు "కాస్త మీ ఆగడాలు చాలిస్తే ఆ కొంగ చెప్పేదేదో విందాం. ఈ నైమిశారణ్యంలో ప్రతిజీవికీ తమ హద్దుల్లో ప్రవర్తించినంత వరకూ, వాళ్ళు చెప్పదలుచుకున్నది చెప్పే హక్కు వున్నదని మరిచిపోకండి"

కొంగ తన పొడుగాటి గొంతును ఈ చివరనించీ ఆ చివరదాకా సర్దుకుని అంది "నేను నీళ్ళల్లో నుంచున్నప్పుడు ఆ నీళ్ళల్లో నా బొమ్మ కనిపిస్తుంది. అది నేనేం చేస్తే అదే చేస్తుంది. ఎందుకలా నా బొమ్మ కనిపిస్తుంది? ఆ నీళ్ళ వెనకాల ఏముంది?" అని అడిగింది.

సూతుడు చిరునవ్వి "నువ్వు అమాయకంగానే ఆ ప్రశ్న అడిగినా అదెంతో లోతైన ప్రశ్న. దానికి అర్ధం చెప్పేముందు నీ కొక ఎన్నారైల కథ చెబుతాను. అది వింటే నీ ప్రశ్నకి జవాబు తెలుస్తుంది.." అని చేత్తో తన గడ్డాన్ని ఒకసారి నిమురుకుని, దివ్య దృష్టితో అమెరికాలో - జార్జియా రాష్ట్రంలోని అట్లాంటా నగరం వేపు తన చూపులు సారించాడు.

"అదిగో అట్లాంటా" అన్నాడు.

"ఏమిటి? ఎట్లాంటా?" అడిగాడు చిన్నముని.

సూత మహాముని నవ్వి "నేను చెప్పేది అమెరికాలోని జార్జియా రాష్ట్రంలోని అట్లాంటా అనే నగరం గురించి నాయనా" అన్నాడు.

చిన్నముని తల వూపి "ఓహో! అట్లాంటారా! ఇక మీరు కథ చెప్పండి గురువు గారూ" అన్నాడు.

సూతుడు కథ చెప్పటం ప్రారంభించాడు.

అట్లాంటాలోని హైవే 400 మీద లెక్సస్ కారులో వెడుతున్నారు సారధి, సావిత్రి.

సావిత్రి అన్నది "మనం ఆల్ఫరెటా దగ్గరగానే కదా వెడుతున్నది. సునీతా వాళ్ళ అమ్మగారూ, నాన్నగారూ వచ్చారుట ఇండియా నించి. ఒకసారి హలో చెప్పి వెడదామా?"

"వాళ్ళింట్లో వుంటారో వుండరో! ఉన్నా ఏదన్నా పనుల్లో బిజీగా వుంటే ఎందుకు డిస్టర్బ్ చేయటం. ఇంకోసారి వెడదాంలే" అన్నాడు సారధి, ఆ రోజునే మెయిల్ ఆర్డర్‌లో వచ్చిన డివిడి సినిమా "సిక్త్ సెన్స్"ని తలుచుకుంటూ.

అతని మనసులోని విషయాన్ని తన సిక్త్ సెన్స్‌తో ముందే పసిగట్టేసిన సావిత్రి, కారులో స్పీకర్ ఆన్‌చేసి, సెల్ ఫోన్‌లో సునీతని పిలిచింది.

"మీ ఇంటికి రెండు మైళ్ళ దూరంలో వున్నాం. మీరు ఖాళీగా వుంటే వద్దామనుకుంటున్నాం" అన్నది సావిత్రి.

సునీత నవ్వి "ఆదివారం మధ్యాన్నం ఎక్కడికి పోతాం. ఇంట్లోనే వున్నాం రండి. ఉల్లిపాయ పకోడీలు చేస్తున్నాను కూడాను" అన్నది.

సారధి అన్నాడు "వాటిల్లో పచ్చి మిరపకాయలు బాగా దట్టించండి. పది నిమి

షాప్లో మీ ఇంటి ముందర వుంటాం"

"తప్పకుండానూ! సీ యు షార్ట్‌లీ" అన్నది సునీత ఫోన్ పెట్టేస్తూ.

బయట నీరెండలో కొంచెం చల్లగా హాయిగా వుంది.

సారథి కారు డ్రైవ్వేలో పార్క్ చేస్తుండగా బయటికి వచ్చాడు రమణ "రండి రండి" అంటూ.

సారథీ సావిత్రీ లోపలకి వచ్చి కూర్చున్నాక, సునీత నవ్వుతూ వచ్చి, "ఇప్పుడే పకోడీలు చేయటం అయింది" అంది.

"మా ఆయన మీ ఇంటికి వెడదామంటే, ముందు అర్థాంతరంగా వెడితే బాగుండదేమో అన్నాడు. పకోడీలు అనగానే పరుగెత్తుకు వచ్చాడు" అంది సావిత్రి తను కూడా నవ్వుతూ.

"ఏమిటి షాపింగ్‌కి వెళ్ళి వస్తున్నారా?" అడిగాడు రమణ.

"ఆ! ఏం షాపింగో. నాకూ షాపింగ్‌కీ అసలు పడదు" సారథి అన్నాడు.

ఈలోగా అక్కడికి వచ్చారు సునీత అమ్మగారూ, నాన్నగారూ.

సునీత పరిచయం చేసింది.

ఆయన చేయి ముందుకు చాచి "నా పేరు జగన్నాథం. సునీత మీ గురించి ఎప్పుడూ చెబుతూనే వుంటుంది. ఈవిడ మా ఇంటికి ఇల్లాలు రాజ్యలక్ష్మి" అని పరిచయాలు పూర్తిచేశాడు.

ఆవిడ కూడా పలకరింపుగా నవ్వి "అవును. మిమ్మల్ని ఇంతవరకూ చూడలేదు కానీ, సునీత మీ గురించీ, మీ స్నేహం గురించీ ఎప్పుడూ చెబుతూవుంటుంది. ఎంతో దూరానవున్న వీళ్ళకి మీలాటి మంచి స్నేహితులు దొరకటం బాగుంది!"

సావిత్రి నవ్వింది. "అదేమిటండీ. ఒకళ్ళకొకళ్ళం తోడు. అంతే" అన్నది.

అందరూ కూర్చున్నాక జగన్నాథం డెల్టా ఎయిర్‌లైన్స్‌లో తమ ప్రయాణం విశేషాలు చెబుతున్నాడు.

మాటల మధ్యలో రమణ అన్నాడు "మీకు చెప్పలేదు మామయ్యగారూ. సారథి కథలు రాస్తాడు. అమెరికాలో మనవాళ్ళ జీవితాల మీద చాల కథలు రాశాడు. మీకు ఆయన పుస్తకాలు సునీత బహుమతిగా పంపించింది కదూ"

జగన్నాథం అన్నాడు "అవును. అన్నికథలూ నేనూ రాజ్యలక్ష్మీ చదివాం. కథలు సరదాగా వ్రాసినా, మీ జీవిత విధానం, దాని వెనకాల మీరు అనుభవిస్తున్న సుఖాలూ పడుతున్న కష్టాలూ చెప్పిన తీరు నన్ను బాగా ఆకట్టుకుంది"

సారథి కొంచెం మొఖమాట పడుతూ అన్నాడు "అదేముంది లెండి. నా చుట్టూ

జరుగుతున్న విషయాలే రాశాను. మీలాటి వారికి ఆ కథలు నచ్చటం, నాకు సరికొత్త స్పందనని ఇస్తున్నది"

సునీత వచ్చి అక్కడ బల్ల మీద పకోడీలు, పేపర్ ప్లేట్లూ, గ్లాసులూ, జగ్‌తో మంచి నీళ్ళు పెట్టింది.

సావిత్రి అందరికీ పకోడీలు ప్లేట్లల్లో పెట్టి అందించింది.

"పకోడీలు చాల బాగున్నాయి" అన్నాడు సారధి సర్టిఫికేటు ఇస్తూ.

"అవును. ఎందుకు బాగుండవూ. నీకెలా కావాలో ఫోన్‌లో చెప్పి మరీచేయిం చుకున్నావు కదా. మేడ్ టు ఆర్డర్ మరి" అన్నది సావిత్రి కవ్వింపుగా.

"ఇండియాలో మీరేం చేస్తుంటారు" జగన్నాధాన్ని అడిగాడు సారధి.

ఆయన నవ్వి "ప్రస్తుతానికేమీ లేదు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో మేథ మేటిక్స్ ప్రొఫెసర్‌గా పని చేసి ఆరు నెలల క్రితమే రిటైరయాను. మాకున్నది ఇద్దరే ఇద్ద రు పిల్లలు. సునీత ఇక్కడ. సూర్యం ఇండియాలో. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో వాడు సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చేసి అమెరికా రావటానికి ప్రయత్నాలు చేస్తు న్నాడు. ఈలోగా సునీత రమ్మని గొడవ పెడుతుంటే ఇక్కడికి వచ్చాం!" అన్నాడు.

"రెండేళ్ళనించీ పోరు పెడుతుంటే ఇప్పుడు కదిలాడు నాన్న" అన్నది సునీత సుతిమెత్తగా కంప్లైంట్ చేస్తూ.

"అవును మరి! అప్పుడు ఉద్యోగం లేదూ. ఇప్పుడయితే రిటైరయారు కాబట్టి వీలు కుదిరింది!" అన్నది రాజ్యలక్ష్మి.

"మీరు ఈమధ్య ఏమన్నా కొత్త కథలు రాశారా?" అడిగాడు జగన్నాధం.

సారధి నవ్వాడు. "ఇక్కడ మా జీవితాలు చూస్తుంటే ఎన్నో విషయాల మీద కథ లు వ్రాసి ఇండియాలోని మనవాళ్ళకు, ఇక్కడి మా జీవితంలోని సుఖదుఃఖాలు చూపిం చాలని వుంది. కానీ ఈ ఉద్యోగపర్వంలో టైమ్ దొరకటం కొంచెం కష్టంగానే వుంది" అన్నాడు.

"ఆఫీసునించి రాత్రి పదింటికి వస్తాడు. పదిన్నరకి మొదలుపెట్టి పన్నెండు దాకా రాస్తాడు. మళ్ళీ పొద్దున్నే ఆరింటికే లేచి ఉద్యోగానికి వెడతాడు. ఇలా వారానికి కనీసం రెండు మూడు రోజులు చేస్తాడు. చెబితే వినడు. పైగా అది తన పేషన్ అంటాడు. ఆఫీసు లో కష్టపడి పనిచేసి వచ్చాక ఆ స్ట్రైన్ తగ్గించుకోటానికిఅదొక మంచి సాధనం అంటాడు" అన్నది సావిత్రి కంప్లైంట్ చేస్తూ.

సారధి నవ్వి వూరుకున్నాడు.

రమణ అన్నాడు "కనీసం అతన్నయినా రాయనీయండి. నాలాటి వాళ్ళకి ఎలా

గూ టీవీ చూట్టంతోనే సరిపోతుంది"

"మీ కథలకు స్ఫూర్తి ఎక్కడినించీ వస్తుంది?" అని అడిగాడు జగన్నాధం.

సారధి ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు "నా చుట్టూ జరిగే ఏదన్నా సంఘటన నన్ను ఆకర్షిస్తే, కదిలిస్తే, ఆ స్పందనతో వ్రాయటం నాకు మొదటి నించీ అలవాటు. ఇండియాలో వున్నప్పుడు కూడా అక్కడ నేను చూసిన విషయాల గురించే వ్రాశేవాడి ని. ఇక్కడికి వచ్చాక అమెరికాలో మా జీవితాల గురించి వ్రాస్తున్నాను"

"అవును. ఏవో తెలియని వాటి గురించి సినిమాటిక్‌గా ఊహించి వ్రాసే బదులు, మన కళ్ళ ముందు జరుగుతున్న విషయాల గురించి సూటిగా, ఉత్సాహం కలిగించేలా చెప్పటం మంచిది కదా!" అన్నాడు జగన్నాధం.

"మా నాన్నతో మాట్లాడండి. మీకు మంచిటాపిక్స్ చాల దొరుకుతాయి" సారధి తో అన్నది సునీత .

సారధి నవ్వి "అవును. నేను ఎన్నాళ్ళనించో వ్రాద్దామనుకుంటున్న కథకి కావల సిన విషయాలు తెలుసుకునే అవకాశమిది" అన్నాడు.

సారధి ఆ సందర్భంగా ఆలోచనలో పడటంతో కొంచెంసేపు నిశ్శబ్దం ఆవహిం చింది. ఉన్నట్టుండి అన్నాడు సారధి "నేను ఎప్పుడో చందమామలో చదివిన ఒక కథ గుర్తు కొస్తున్నది. చెప్పనా?"

రమణ పెద్దగా నవ్వాడు. "పొరపాటున చెప్పాను బాబూ నువ్వు కథలు రాస్తా వని. అది అలుసుగా తీసుకుని చందమామ కథలు చెబుతావా?" అన్నాడు.

తెల్లకొంగ నొప్పిపెడుతున్న కుడికాలుని కిందకి దించి ఎడమకాలు పైకెత్తి "నేను నా పొడుగాటి మెడను ఎంత చాచి చూసినా, చందమామలో కథలు కనపడటం లేదు బాబూ" అన్నది.

"నీ మొఖం. ఆయన చెప్పేది ఆ చందమామ కాదు. చందమామ అని ఒక పిల్లల పుస్తకం. పిల్లలూ పెద్దలూ అందరూ బాగా ఇష్టపడి చదివిన పుస్తకమది. సరసమైన కథల పత్రికలు వచ్చాక చందమామ మసక పడిపోయింది" అన్నాడు శుకమహర్షి ఆ నీలాకా శపు పగటి మబ్బుల్లో చందమామను వెదుకుతూ.

సూతుడు కూడా ఆకాశంలోని చందమామ కోసం ఒకసారి చూసి, కనపడనం దున తన కథ కొనసాగించాడు.

"చందమామ కథలంటే నాకు చాల ఇష్టం. చెప్పండి" అన్నది రాజ్యలక్ష్మి.

సారధి ఒకసారి అందర్నీ చూసి కథ మొదలు పెట్టాడు. "అనగా అనగా ఒక వూళ్ళో ఒక రాజుగారు వుండేవారు. ఆస్థాన మంగలి రోజూ పొద్దున్నే వచ్చి, రాజుగారి

కి గడ్డం గీసి వెళ్ళేవాడు. గడ్డం గీస్తున్న మంగల్ని ఆయన రోజా అడుగుతుండేవారుట "నా రాజ్యంలో ప్రజలెలా వున్నారు" అని. అతను ఆస్థాన మంగలి కనుకా, బాగానే డబ్బున్న మనిషి కనుకా, స్వతంత్రంగా రాజభవనంలో తిరిగేవాడు కనుకా, అతన్నంద రూ కొంచెం ప్రత్యేకంగా చూశేవారు. సుఖంగా బ్రతుకుతున్న ఆ మంగలి - మీ రాజ్యం లో మాకు లోటేమిటి మహాప్రభూ! ప్రజలందరూ చాలాసుఖంగా ఆనందంగా వున్నారు. అందరి దగ్గరా చాలా డబ్బూదస్కం బంగారం దండిగా వుంది. శాంతి భద్రతలకు కొదు వు లేదు - అని చెప్పేవాడు. రాజుగారు ఆ మాటలు విని చాల సంతోషించేవాడు. కాస్తో కూస్తో బహుమానాలు కూడా అందించేవాడు. ఈవ్యవహారం రోజా ఇలా జరుగుతూ నే వుంది. ఇంతలో ఒకరాత్రి మంగలి ఇంట్లో దొంగలు పడి, అతన్నికొట్టి డబ్బూ దస్కం బంగారం పూర్తిగా దోచుకుపోయారు, మర్నాడు రాజుగారికి గడ్డం గీస్తున్నప్పుడు మంగలి, ఆయన ప్రశ్నకి జవాబిస్తూ -ఏం చెప్పమంటారు మహాప్రభూ! మీ రాజ్యంలో ఇప్పుడు అరాచకం, దొంగతనాలూ, దోపిడీలూ విపరీతంగా పెరిగిపోయాయి. ప్రజలం దరూ తమ ఆస్తిపాస్తుల్ని పోగొట్టుకుని నానాబాధలూ పడుతున్నారు. మీరు వెంటనే ఏదయినా చేయకపోతే శాంతి భద్రతలు సర్వనాశనం అయిపోతాయి -అన్నాడు" అని సారధి కథ చెప్పటం పూర్తి చేశాడు.

రమణ ముఖం అదోలా పెట్టి "ఈకథకీ మాట్లాడుతున్న విషయానికీ సంబంధమే మిటో నాకు అర్ధమయినట్టు లేదు" అన్నాడు.

జగన్నాధం ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు. "మీరు చెప్పింది నాకు పూర్తిగా అర్ధమయింది. మనం అద్దంలో చూసుకున్నప్పుడు మన ముఖమే కనిపిస్తుంది. ఏరకంగా అలంకరించుకుంటే అదే రకంగా కనిపిస్తుంది. మనం ఆ అద్దం ముందు ఏది పెడితే అదే కనిపిస్తుంది. కానీ ఆ అద్దానికి అవతలి వైపు ఏముందో అద్దంలో కనపడదు. వెనక్కి వెళ్ళి చూస్తే తప్ప"

సూతుని కథకు అడ్డం వస్తూ అన్నాడు చిన్నముని. "ఏమిటో మీ కథ కొంగజపం తో మొదలుపెట్టి అక్కడ్నించీ అట్లా అట్లా అట్లాంటా దాకా వెళ్ళారు. అక్కడి నించీ రాజుగారి గడ్డం గీసే సీను చూపించారు. తర్వాత అద్దంలో బొమ్మగురించి చెబుతున్నా రు. మీరు మాకు భూగోళం కథ చెబుతానని ఏవో గందరగోళం కథలు చెబుతున్నారు"

శుకమహర్షి దురద పెడుతున్న ముక్కు మీద చూపుడు వేలితో సుతారాంగా గోక్కుని, ఆ వేలుని ముక్కు మీదే వుంచి "హుష్!" అన్నాడు.

సూత మహాముని తను ఎప్పుడూ నవ్వే చిరునవ్వుని మరోసారి ప్రదర్శించి, కథ చెప్పటం కొనసాగించాడు.

"అవును! బాగా చెప్పారు. ఇందాకే చెప్పాను ఊహించి వ్రాయటం నా కిష్టంలేద ని. అనుభవాన్ని ఊహించుకుంటే అది ఊహాపరంగానే వుంటుంది. అనుభవిస్తున్నవారు మీరు కాబట్టి, మీరు చెబితే బాగుంటుంది. చెప్పండి" అన్నాడు సారధి జగన్నాథంతో.

జగన్నాథం ఒక్క క్షణం మాట్లాడకుండా ఊరుకున్నాడు. కొంచెం ఆలోచించి నెమ్మదిగా అన్నాడు. "మన దేశంకాని ఈ దేశంలో మీరందరు చాల కష్టపడి పైకి వచ్చా రు. మంచి ఉద్యోగాల్లో వున్నారు. సాంకేతిక రంగంలో చక్కగా నిలదొక్కుకోవటమే కాకుండా పేరూ పేటెంట్లూ కూడా సంపాదించుకుంటున్నారు. మంచి ఇళ్ళు కట్టుకుని, ఖరీదైన కార్లు కొనుక్కుని, సుఖంగా వుంటున్నారు. పిల్లల్ని మంచిపేరున్న కాలేజీలకి ప ంపించి చదివిస్తున్నారు. ఏ రకంగా చూసినా గొప్ప జీవితం అనుభవిస్తున్నారు. మీరు అ లా సుఖంగా వున్నందుకు, కన్నతల్లిదండ్రులమైన మాకు అంతకన్నా ఎక్కువ సంతోషమే ముంటుంది!"

"ఇక్కడ వున్న మనవాళ్ళంతా మీరంటున్నంత సుఖంగా లేరనుకోండి" అన్నది సావిత్రి నెమ్మదిగా.

"సుఖంగా లేకుండా కష్టాలు పడుతుంటే ఇక్కడే ఎందుకు వుంటారమ్మా! వెనక్కి వెళ్ళి మనవాళ్ళకి దగ్గరగా ఇండియాలో సెటిలయిపోవచ్చు కదా" అంది రాజ్యలక్ష్మి.

"ఇక్కడ సమస్యలు లేవని కాదు. అవి పెద్ద సమస్యలు కావనీ, వాటితో బ్రతకటం అలవాటు చేసుకున్నామనీ. అక్కడి కష్టసుఖాలు అక్కడా వున్నాయి. ఇక్కడ సుఖంగా లేదని అక్కడికి వెళ్ళి సుఖపడతారని అనుకోవటం కూడా సరికాదు" అన్నాడు రమణ.

"అదేమిటి. ఇండియాలో సుఖంగాలేదని కాదూ ఇక్కడికి వచ్చింది. అలాగే ఇదీ నూ" అన్నది రాజ్యలక్ష్మి.

కాఫీలు బల్ల మీద పెడుతూ అన్నది సునీత. "సుఖాలు, కష్టాలు అన్నవి మన మనసుల్లో వున్నాయి. నా ఉద్దేశ్యంలో ఒక ప్రదేశంతో కానీ డబ్బుతో కానీ సంబంధం లేనివి అవి. కష్టసుఖాలు అక్కడా వున్నాయి. ఇక్కడా వున్నాయి. బీదవాళ్ళకీ వున్నా యి. ధనవంతులకీ వున్నాయి"

"అలా అయితే నువ్వు ఇక్కడ సుఖంగా వున్నావని మా మనసు చెబుతున్నది కనుక, మేము ఇద్దరం ఇండియాలో సుఖంగా వున్నామనా నీ ఉద్దేశ్యం" అని అడిగింది రాజ్యలక్ష్మి.

"అదెలా అవుతుందండీ. మీ ఇంటికి మా ఇల్లు ఎంత దూరమో, మా ఇంటికి మీ ఇల్లూ అంతే దూరం అవాలి కదా. మమ్మల్ని మిస్సవుతూ మీరెంత ఫీలవుతున్నారో, మిమ్మల్ని మిస్సవుతూ మేమూ అంతే ఫీలవుతుంటాం కదా" అన్నాడు రమణ.

"అంటే సుఖంగా ఉన్నామనుకుంటున్న మేము, చూస్తున్న అద్దంలో సుఖంగా వుంటున్నట్టు మాత్రమే కనిపిస్తున్నామంటారా?" అన్నది సావిత్రి.

జగన్నాథం నవ్వాడు. "సునీతా! ఇందాక అన్నావే ఈ సుఖ సంతోషాలు మన మనసుల్లో వుండేవే అని. ఇన్నాళ్ళూ అలానే మా మనసుల్ని మభ్యపెట్టుకుని వున్నామక్కడ. ఎంతో గారాబంగా పెంచుకున్న ఒకే ఒక ఆడపిల్ల, దేశం కాని దేశం వెడుతుంటే అదే అనుకున్నాం. నాలుగైదేళ్ళ కొకసారి వచ్చి వెడుతుంటే, పోనీలే అదే మా అదృష్టం అనుకున్నాం. మనవరాళ్ళు మనవలూ మన పంచవర్ష ప్రణాళికల్లాగా అయిదేళ్ళ కొకసారి వచ్చి మనసారా అమ్మమ్మతో మాట్లాడటానికి భాష రాక వింతగా చూస్తుంటే, పోనీలే కనీసం కళ్ళారా చూస్తున్నాం కదా అని సరిపెట్టుకుంటున్నాం" అన్నాడు జగన్నాథం.

"ఇండియాలో కూడా ఇప్పుడిలాగే వుంది కదా నాన్నా. తల్లిదండ్రుల్ని ఆంధ్రాలో వదిలేసి, మనవాళ్ళు బెంగుళూరు, మద్రాసు, బొంబే, కలకత్తాలకు వెళ్ళటం లేదూ! ఉద్యోగాలకోసం ఊరు వదిలి వెళ్ళిపోవటం, అవకాశాల దృష్ట్యా తప్పదు మరి" అంది సునీత.

సారథి అన్నాడు. "అవునండీ. మేము త్రివేండ్రంలో వున్నప్పుడు అంతేమరి. ఆ రోజుల్లో అక్కడినించీ మా ఊరుకి రైల్లో ఇరవై నాలుగు గంటలు పట్టేది. ఇప్పుడు అమెరికా నించీ ఇండియాకి విమానంలో అంతే టైమ్‌లో వెళ్ళవచ్చు.."

"అవును. కనీసం ఇక్కడ మనకి అర్థమయే ఇంగ్లీషులో మాట్లాడతారు. త్రివేండ్రం వెళ్ళిన కొత్తల్లో, మళయాళం రాక మేము చాల ఇబ్బందులు పడ్డాం కూడానూ!" అంది సునీత.

జగన్నాథం ఈసారి పెద్దగా నవ్వాడు. "చూశావా అమ్మా! ఇప్పుడు అద్దంలో నువ్వు చూద్దామనుకుంటున్నది అది. అదే చూస్తున్నావు. త్రివేండ్రం వెళ్ళిన కొత్తల్లో అప్పుడు చూద్దామనుకున్నవి చూడటం వల్ల, అక్కడ మీకప్పుడు బాగానే వుంది. కానీ ఇప్పుడు తెలుస్తున్నాయి ఆ ఇబ్బందులు" అని మళ్ళీ నవ్వాడు.

సునీత ఒక్కక్షణం జగన్నాథాన్ని సాదరంగా చూసి తనూ నవ్వింది.

"మాకు వున్నది ఇద్దరే పిల్లలు. సునీత ఇక్కడ అమెరికాలో వుంటున్నది. కనీసం శ్రీనివాసయినా ఇండియాలో మాదగ్గర వుంటాడనుకున్నాం. వాడిప్పుడు అమెరికా వచ్చి ఏదన్నా సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేయాలని ప్రయత్నం చేస్తున్నాడు. అంటే ఇక ఇద్దరు పిల్లలూ అమెరికాలోనే వుంటారు" రాజ్యలక్ష్మి ఆ మాటలు అంటున్నప్పుడు ఆవిడ కళ్ళల్లో నీళ్ళు బయటకు వచ్చి, సభ్యత కోసం ఆవిడ బుగ్గల మీదే ఆగిపోవటం

గమనించించాడు సారథి.

"సునీతా! పకోడీల్లో ఉల్లిపాయలు ఎక్కువగా వేసినట్టున్నావు. నాకు కళ్ళల్లో నీళ్ళు వస్తున్నాయి" అన్నాడు సారథి కళ్ళల్లో లేని నీళ్ళని తుడుచుకుంటూ.

రాని నవ్వుని తెచ్చిపెట్టుకుంటూ, సావిత్రి రాజ్యలక్ష్మితో అంది "మరింకేం! మీరూ ఇక్కడే వుండిపోవచ్చు..." అని.

"అదంత సులభం అనుకుంటున్నావా అమ్మా! ఇండియాలో అరవయ్యేళ్ళు అక్కడి జీవితానికి అలవాటు పడిన వాడిని ఇక్కడ వుండగలనా. ఇక్కడికివచ్చి పిల్లల దగ్గర ఆరు నెలలు వుండి వచ్చిన మాధవరావుగారు ఏం చెప్పారో తెలుసా? మొదట్లో బాగానే వుందిట కానీ, తర్వాత ఏమీ తోచక ఎప్పుడు వెళ్ళిపోదామా అని మహా ఆరాట పడ్డారుట. ఈవయసులో మాలాటి వారికి ఎడాప్టబిలిటీ వుంటుందని నేను అనుకోను" అన్నాడు జగన్నాధం.

"బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకి నెలకి యాభై వేల రూపాయల పైన జీతం ఇస్తున్నారుట. అంతంత జీతాలు ఇస్తున్నప్పుడు వాడికి అమెరికా రావలసిన అవసరం వుందా?" అన్నది రాజ్యలక్ష్మి.

జగన్నాధం చాల సౌమ్యంగా అన్నాడు రాజ్యలక్ష్మితో.

"రాజ్యం! అది వాడి నిర్ణయం. వాడి భవిష్యత్తు గురించి వాడు తీసుకుంటున్న నిర్ణయాన్ని సమర్ధించటం తల్లిదండ్రులుగా మన బాధ్యత. ఎక్కడున్నా వాడు క్షేమంగా వుండటమేగా మనకి కావలిసింది. ఈ పదేళ్ళల్లోనూ మనమ్మాయితో మనం కలిసి వుండ టం ఇది రెండోసారి. ఇకనించి మన అబ్బాయితో కూడా అంతే. ఇండియాలో మనిద్దరం ఏదయినా వ్యాపకం పెట్టుకోవటం మంచిది"

సావిత్రి అన్నది. "మేము అమెరికా వచ్చాక, మా అక్కయ్య పిల్లలకీ, అన్న య్యల పిల్లలకీ, మిగతా దగ్గరి బంధువుల పిల్లలకీ... ఎంతమందికి పెళ్ళిళ్ళు అయాయో. ఒక్కదానికీ వెళ్ళలేక పోయాం"

"పెళ్ళిళ్ళకి వెళ్ళలేక పోవటంకన్నా విచారించ వలసిన విషయం ఒకటి వుంది. గోవిందరాజన్‌గారి అమ్మగారు మూడునెల్ల క్రితం ఇండియాలో చనిపోయారు. ఆవిడ కు చాల సీరియస్‌గా వున్నప్పుడు, ఈయన వాళ్ళ నాన్నగారితో మాట్లాడిన తర్వాత, ఆవిడ ఫోన్ తీసుకోబోతూనే కొలాప్సయి చనిపోయారు. ఇక్కడ ఫోన్ పట్టుకు నుంచు న్న గోవిందరాజన్‌కి, ఏం చేయాలో తెలీక కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఆయన బాధ చూడలేక ఆ రాత్రంతా భగవద్గీత చదివి వినిపిస్తూ కూర్చుందిట కామేశ్వరి" అన్నది సునీత.

రమణ ఒకసారి గాఢంగా నిట్టూర్చి "వాతావరణం బయటికన్నా కూడా లోపల బాగా వేడిగా వున్నట్టుంది.... కాస్త అలా పెరట్లోకి వెళ్ళి, చల్ల గాలి పీల్చుకుందాం...." అన్నాడు లేస్తూ.

"అవును. మా ఆయన సొర, బీర పాదుల్ని ఫెర్టిలైజర్ వేసి ఏపుగా పెంచుతున్నాడు. మీకు చూపిద్దామని ఆయన ఆరాటం" అన్నది సునీత నవ్వుతూ.

"మా పక్కింటి జాన్ అడిగాడు అదేం మొక్క అని. నేను బీర అని చెబితే, అతను బీర్ ఇచ్చే మొక్క అనుకున్నాడు" అన్నాడు రమణ అక్కడి వాతావరణాన్ని కొంచెం తేలిక పరుస్తూ.

సారధి కూడా నవ్వాడు.

బయట కొంచెం చల్లగా ఆహ్లాదంగా వుంది. సొర, బీర పాదులు బాగా పైకి వస్తున్నాయి.

"అప్పుడే పూలు పూస్తున్నాయి కూడానూ. త్వరలో కాయలు కోసుకోవచ్చు" అన్నది సావిత్రి.

"కాయలు రానీ. మీకూ ఇస్తాంలే" అన్నది సునీత.

"మీరు వేరే పెద్ద ఇంటికి వెడదామనుకుంటున్నారు కదా. ఏమయింది?" అడిగాడు సారధి

"అటూ ఇటూగా వుంది. ఇంకా ఏమీ అనుకోలేదు. ఈ వారంలో ఒక నిర్ణయానికి రావాలి " అన్నాడు రమణ.

"మరి ఇంత బాగా పెరిగిన మొక్కల్ని ఇలాగే వదిలేసి వెళ్ళిపోతారా...." అడిగింది సావిత్రి.

"వదిలేసి వెళ్ళక తప్పదు. రీప్లాంట్ చేస్తే అవి కొత్త సాయిల్ కండిషన్సుకి ఎడ్జస్ట్ అవుతాయో లేదో.. అసలు బతుకుతాయో లేదో... " అన్నది సునీత.

ఆ మాటలు విని, జగన్నాధం వేపు చురుగ్గా చూశాడు సారధి.

జగన్నాధం పెదవులమీద ఒక చిన్న నవ్వు కనీకనిపించకుండా నాట్యం చేసింది.

అని ఆ కథ చెప్పటం ముగించాడు సూత మహాముని.

ఏదో మాట్లాడబోయి, ఏం మాట్లాడాలో అర్ధం కాక బుర్ర గోక్కుంటున్నది ఎర్ర కోతి. గోక్కుంటుంటే చేతిలోకి వచ్చిన పేనుని గోళ్ళ మధ్య టిక్కుమనిపించింది.

"ఈ కథ నా లాగానే కొంచెం బరువుగా వుంది" అంది పక్కనే నుంచున్న ఏనుగు పిల్ల మాట్లాడుతున్నప్పుడు అడ్డం వస్తున్న తొండాన్ని పైకెత్తి.

"మరి ఇందాక నేనడిగిన ప్రశ్న సంగతేమిటి?" అడిగింది కొంగ, ఈసారి రెండు

కాళ్ళూ నీళ్ళల్లోనే వుంచి, తన తెల్లటి అందాల్ని నీళ్ళల్లో చూసుకుంటూ.

"ఈ కథ నాకే అర్థమయింది. నీకు అర్థం కాలేదంటే.... నీది మట్టి బుర్ర. ఒట్టి తెల్లటి మట్టి బుర్ర" అన్నాడు చిన్నముని తను కూడా లేస్తూ.

శుకమహర్షి చిన్నముని వేపు ఒకసారి ఆప్యాయంగా చూసి - "ఫరవాలేదు. ఎదుగుతున్నాడు" అనుకుని తనూ లేచి నుంచున్నాడు.

"ఇక వెడదాం. చీకటి పడింది" అని తనూ లేచి, ముందుకు కదిలాడు సూతమహాముని. ❀